స్తబ్ధత వీడితే కొలువు కొట్టొచ్చు!

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో వివిధ కారణాల వల్ల ప్రభుత్వ ఉద్యోగాల ఆశావహుల్లో స్తబ్ధత ఏర్పడింది. దీంతో ఇంతకాలంగా కొనసాగిస్తున్న పోటీ పరీక్షల సన్నద్ధతకు అంతరాయం ఏర్పడింది. ఇలా ప్రిపరేషన్‌ను పక్కనపెట్టి వివిధ ఇతర కార్యకలాపాల్లో లీనమవ్వటం అభ్యర్థుల దీర్ఘకాలిక లక్ష్యాన్ని దెబ్బతీస్తుంది. ఈ అనిశ్చితిని అధిగమించి పూర్వపు ఉత్సాహం, ప్రేరణలను అందిపుచ్చుకోవటం చాలా ముఖ్యం. ఇందుకు ఏమేం చేయాలో తెలుసుకుందామా?

తెలంగాణ : గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్షపై స్పష్టత రాకపోవడం, గ్రూప్-2 పరీక్ష జనవరికి వాయిదా పడటం, ఈ లోపల ఎన్నికల ప్రకటన రావడం.. ఇదీ వర్తమాన స్థితి. ఎన్నికల ఫలితాల అనంతరం ఏర్పడే ప్రభుత్వం ఈ నోటిఫికేషన్‌లపై ఏ విధంగా స్పందిస్తుంది అనే విషయంలో సందిగ్ధత.. మొదలైన కారణాలతో మెజారిటీ అభ్యర్థులు ప్రిపరేషన్‌కు దూరంగా ఉంటున్నారు.

ఆంధ్రప్రదేశ్: గ్రూప్ 1, 2 పరీక్షల ఖాళీలపై జీవోలు విడుదలైనప్పటికీ నోటిఫికేషన్లు ఎప్పుడు విడుదలవుతాయి అనే విషయంలో స్పష్టత లేదు. గ్రూప్-1 సిలబస్ మారుతుందనే వార్తలు, సచివాలయ ఉద్యోగాల విషయంలో స్పష్టత లేకపోవడం, డీఎస్‌సీ ఖాళీల సంఖ్యపై స్పష్టత వస్తున్నప్పటికీ అనంతర జీవోలు విడుదల కాకపోవటం, మరో నాలుగు నెలల తర్వాత ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే అవకాశం.. ఇదీ ప్రస్తుత స్థితి. కొత్తగా ఎన్నికయ్యే ప్రభుత్వం ఉద్యోగాల నోటిఫికేషన్లపై తీసుకునే ధోరణి ఎలా ఉంటుందోననే సందేహం.. మొదలైన కారణాల వల్ల సీరియస్ అభ్యర్థులు కూడా 100% దృష్టిని ఈ పరీక్షలపై నిలపటం లేదు. ఫలితంగా కోరుకున్న లక్ష్యాలు మరింత దూరమయ్యే ప్రమాదం కనిపిస్తోంది.

లక్షలమంది పోటీపడే పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షల్లో కొన్ని ప్రత్యేక లక్షణాలను సంతరించుకున్నప్పుడే ఉద్యోగ సాధన వరకూ విజయవంతమైన ప్రయాణం సాగించే అవకాశం ఉంటుంది. లేకపోతే.. ఎదురవుతున్న సవాళ్లను పరిష్కరించుకోలేక ఈ పోటీ ప్రయాణంలో మధ్యంతరంగా విరమించే ప్రమాదం ఎక్కువ. నిజానికి ఈ పోటీ పరీక్షలకు దరఖాస్తు చేసినవారిలో సుమారుగా 90 శాతం మంది మధ్యలో చేతులెత్తేసేవారే. సుదీర్ఘ ప్రయాణాన్ని కొనసాగిస్తూ ఆటుపోట్లను తట్టుకుంటూ ఉండే అభ్యర్థులు సగటు స్థాయి ప్రజ్ఞావంతులే అయినా అంతిమంగా కొలువులు పొందుతూ ఉంటారు.

ఈ ప్రత్యేక లక్షణాలు ముఖ్యం

1 సుదీర్ఘ పోరాటం

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలకు పోటీపడేటప్పుడే సుదీర్ఘ కాల పోరాటానికి సిద్ధపడాలి. అప్పుడే ఎటువంటి అవాంతరాలైనా సులభంగా ఎదుర్కొనే మానసిక స్థితి ఏర్పడుతుంది. స్థానిక పరిస్థితుల వల్ల యూపీఎస్సీ తరహాలో ఒక షెడ్యూల్ ప్రకారం నిర్వహించలేని పరిస్థితి ఉంటుంది. అటువంటి క్లిష్టతను ముందుగానే ఊహించుకుని అందుకనుగుణంగా ఆర్థిక, ఇతర వనరులను సమకూర్చుకుని చిట్టచివరి లక్ష్యం చేరేవరకు సన్నద్ధత కొనసాగిస్తూనే ఉండాలి. ఇప్పుడు రెండు రాష్ట్రాల్లో నోటిఫికేషన్లు, షెడ్యూలు వెలువడినప్పటికీ తుది ఫలితం వెంటనే ఆశించకుండా ఎప్పుడు పరీక్షలు జరిగినా రాసేందుకు సిద్ధమే అన్నట్లుగా ఉండాలి.

2 సబ్జెక్టుతో అనుసంధానం

అవిచ్ఛిన్నంగా చదవటం అనేది అభ్యర్థులకు ఉండాల్సిన మరొక తప్పనిసరి లక్షణం. నోటిఫికేషన్ కోసం సంవత్సరాల తరబడి నిరీక్షణ, పరీక్షలు వాయిదా పడుతూ ఉండటంతో వారి ప్రిపరేషన్ ప్రయాణంలో అంతరాలు వస్తూ ఉంటాయి. ఇటువంటి పరిస్థితుల్లో కూడా ప్రతిరోజూ కనీసం నాలుగు నుంచి ఆరు గంటలైనా వివిధ పేపర్ల సబ్జెక్టులు చదువుతూ సబ్జెక్టుతో అనుసంధానమై ఉండాలి. ఇది ఉంటే పరీక్ష ఎప్పుడు జరిగినా సమర్థంగా ఎదుర్కొని, కొలువు కొట్టే అవకాశం ఉంటుంది.

> **సానుకూల ధోరణి, భవిష్యత్తు పట్ల ఆశ ఏమాత్రం సడలకుండా సహనంతో సుదీర్ఘ ప్రయాణం చేయటమే పోటీ పరీక్షల విజయ రహస్యం. ఈ విషయం గుర్తెరిగి అందుకు అనుగుణంగా వ్యవహరించాలి.**

3 'బోనస్' వ్యవధి

'ప్రతి సంక్షోభమూ ఒక అవకాశమే' అనే సూక్తి గుర్తు చేసుకోండి. నోటిఫికేషన్ వాయిదా పడుతున్నా, పరీక్షలు వాయిదా పడుతున్నా లభించే సమయాన్ని బోనస్‌గా భావించాలి. పరిజ్ఞానాన్ని మరింతగా మెరుగు పెట్టుకోవాలి. ఇలా చేసినప్పుడే ఉత్తమమైన ర్యాంకులు

వస్తాయి. వాయిదాలు పడుతున్న పరిస్థితిని గమనించి ఒత్తిడి గురైతే మరింత నష్టమే గాని ప్రయోజనం ఏమీ ఉండదు. వాయిదా పడుతున్నప్పుడల్లా స్థాయిని మెరుగుపరుచుకుంటున్నామనే భావన పెంచుకుంటే మనసు సానుకూలంగా స్పందిస్తుంది అందువల్ల మరింతగా చదవగలుగుతారు. జ్ఞాపకశక్తి బలంగా ఏర్పడుతుంది.

4 నోట్సు తయారీ

సొంత నోట్సు తయారు చేసుకునే సదవకాశం ఇలాంటి సందర్భాల్లోనే దొరుకుతుంది. రెండు మూడు పుస్తకాలు చదువుకొని దానిలోని సారాంశాన్నీ, ముఖ్యాంశాలనూ ఒకే నోట్సులో రూపొందించుకోవడం వల్ల పరీక్షల ముందు సమయపు వృథా తగ్గుతుంది. ఒత్తిడి కూడా తగ్గిపోయి ప్రశాంతంగా పరీక్షలు రాసే పరిస్థితి ఏర్పడుతుంది. అందువల్ల నోటిఫికేషన్లు వాయిదా పడినా, పరీక్షలు వాయిదా పడినా తీవ్ర ఒత్తిడికి గురికాకూడదు. ఇదో మంచి అవకాశమని భావించే తత్వాన్ని ఏర్పరచుకోవాలి.

- కొడాలి భవానీ శంకర్

5 ప్లాన్- బి

చాలామంది అభ్యర్థులు రాష్ట్ర పోటీ పరీక్షలపై అవగాహన లేకుండా ఆర్థికంగా కొంత మొత్తాన్ని సిద్ధపరచుకుని, నిర్దిష్ట కాలానికి ప్రణాళిక రచించుకుని రంగంలోకి దిగుతారు. అయితే సకాలంలో నోటిఫికేషన్లు రాకపోవచ్చు, పరీక్షలు జరగకపోవచ్చు. ఇలాంటి పరిస్థితుల్లో తాము ఏర్పరచుకున్న డబ్బు మొత్తం అయిపోతుంది. తర్వాత ఏం చేయాలో తెలియక తీవ్ర అసహనానికి గురవుతూ దీర్ఘకాలిక లక్ష్యాన్ని విడిచి పెడుతుంటారు. అలాగే చాలామంది చిరుద్యోగులూ, నిరుద్యోగులూ ఈ వాయిదాల సంస్కృతిని అర్థం చేసుకోలేకపోతుంటారు. దిశా నిర్దేశం లేక ప్రతిభాపాటవాలు ఉండి కూడా ట్రాక్ తప్పుతూ ఉంటారు. మరికొంతమంది జీవనోపాధిని వదులుకొని ఈ పరీక్షలకు సిద్ధమవుతారు. కానీ సకాలంలో వారు అనుకున్నది జరగక తిరిగి జీవనోపాధి కోసం ప్రిపరేషన్ నుంచి వెళ్లిపోతారు. ఇలాంటి పరిస్థితుల్ని ముందుగానే అర్థం చేసుకుని ప్లాన్-బి అనేది ఏర్పరచుకుంటే ఒత్తిడి తగ్గుతుంది. అంటే దీర్ఘకాలికంగా ప్రిపేర్ అవ్వాల్సినపుడు అటు సన్నద్ధమవుతూనే ఏదైనా జీవనోపాధిని పార్ట్ టైమ్‌గా చేసుకోవడం ద్వారా కొన్ని ఒత్తిళ్లను అధిగమించవచ్చు. ముఖ్యంగా ఆర్థికపరమైన ఒత్తిడిని.

6 కొత్త కోర్సులు

ఇలా నోటిఫికేషన్లూ, పోటీ పరీక్షలూ వాయిదా పడుతున్న సందర్భాల్లో విలువైన సమయం సద్వినియోగం చేసుకునేందుకు ఏవైనా కొత్త కోర్సులు లేదా స్కిల్స్‌కు సంబంధించిన అభ్యసనాల్ని చేయటం మంచిది. తద్వారా ఒకవేళ పోటీ పరీక్షల్లో రాణించలేకపోయినా ఆ నైపుణ్యాలతో జీవితంలో స్థిరపడే అవకాశం ఉంటుంది.

7 పరిజ్ఞానానికి పదును

లభిస్తున్న ఈ సమయంలో అటు బేసిక్స్‌నూ, ఇటు వర్తమాన అంశాల పరిజ్ఞానాన్నీ సానపెట్టుకుంటూ ఉండాల్సిందే. అప్పుడు మాత్రమే నిర్దేశించుకున్న దీర్ఘకాలిక లక్ష్యాన్ని సాధించగలుగుతారు.

8 పోటీ మెలకువలు

సీనియర్ అభ్యర్థులనూ, సివిల్స్ ఆశావహులనూ తాజా అభ్యర్థులు ఎదుర్కోవాలంటే అంత సులభమైన విషయం ఏమీ కాదు. ఇలా నోటిఫికేషన్లు, పరీక్షలు వాయిదా పడినప్పుడల్లా వాళ్ళని ఎదుర్కొనేందుకు ఎటువంటి మెలకువల్ని సాధించాలి అనే పక్కా ప్రణాళిక రచించుకోవాలి. దాన్ని అమలు చేసేందుకు ఇదే అనువైన సమయమని గుర్తించండి.

9 నమూనా పరీక్షలు

ఈ సందిగ్ధ పరిస్థితిని మంచి ఫలితాలు రాబట్టుకునేందుకు వాడుకోవచ్చు. అందుకోసం పకడ్బందీగా నమూనా పరీక్షలు రాయాలి. తప్పొప్పులు సరిచూసుకుని, సరిదిద్దుకునేందుకు ఇప్పుడు లభిస్తున్న సమయాన్ని వెచ్చించాలి.

క్రీడల కోచ్ అయ్యేదెలా?

బీకామ్ చివరి ఏడాది చదువుతున్నా. క్రీడలంటే ఉండే ఆసక్తితో స్పోర్ట్స్ కోచ్ అవ్వాలనుకుంటున్నా. అలాగని నేను ఛాంపియన్‌ను కాదు. ఈ కెరియర్‌ను ఎంచుకోవడానికి అర్హుడినేనా? - విక్రమ్

■ క్రీడల కోచ్ అవ్వాలంటే వాటిలో ఛాంపియన్ అవ్వాల్సిన అవసరం లేదు. కానీ క్రీడలపై విపరీతమైన ఆసక్తి, కనీసం రెండిట్లో ప్రవేశం, ఈ రంగాన్ని కెరియర్‌గా మార్చుకోవాలనే లక్ష్యం, క్రీడలతోనే జీవితకాలం గడపగలిగే బలమైన కోరిక అవసరం. ఇవన్నీ ఉంటే స్పోర్ట్స్ కోచ్ అవటం పెద్ద కష్టమేమీ కాదు. నాయకత్వ లక్షణాలు, శారీరక దార్ఢ్యం, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, ప్రేరణ సామర్థ్యం, ఓపిక, సహానుభూతి, బలమైన వ్యక్తిత్వం.. వీటితో పాటు ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో సర్టిఫికెట్ / డిప్లొమా / గ్రాడ్యుయేషన్ / పోస్ట్ గ్రాడ్యుయేషన్/ పీహెచ్‌డీ ఉన్నట్లైతే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగవుతాయి. మీరు ఏ క్రీడలో శిక్షకునిగా స్థిరపడాలనుకుంటున్నారో దానిపై స్పష్టత అవసరం. ఆ క్రీడలో పేరు పొందిన కోచ్ దగ్గర కొంతకాలం శిక్షణ తీసుకోవాలి. తర్వాత ఏదైనా స్టేడియంలో గానీ, అకాడమీలో గానీ, విద్యాసంస్థలో గానీ కోచ్‌గా కెరియర్ ప్రారంభించవచ్చు. ఇటీవల కొన్ని ప్రైవేటు యూనివర్సిటీలు / సంస్థలు స్పోర్ట్స్ కోచింగ్‌లో సర్టిఫికెట్ / డిప్లొమా కోర్సులను అందిస్తున్నాయి. ఆ సంస్థల విశ్వసనీయత గురించి పూర్తిగా తెలుసుకొని కోర్సులో చేరే నిర్ణయాన్ని తీసుకోండి.

– ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

నోటిఫికేషన్స్

ప్రభుత్వ ఉద్యోగాలు

ఎన్‌పబీఎఫ్‌ఐడీలో ఆఫీసర్లు

ముంబయిలోని నేషనల్ బ్యాంక్ ఫర్ ఫైనాన్సింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ డెవలప్‌మెంట్ (ఎన్‌పీబీఎఫ్‌ఐడీ), రెగ్యులర్ ప్రాతిపదికన 56 ఆఫీసర్ (అనలిస్ట్) ఖాళీల నియామకానికి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది.
స్ట్రీములు: లెండింగ్ ఆపరేషన్స్, హ్యూమన్ రిసోర్సెస్, ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ట్రెజరీ, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అండ్ ఆపరేషన్స్, జనరల్ అడ్మినిస్ట్రేషన్, రిస్క్ మేనేజ్‌మెంట్, లీగల్, ఇంటర్నల్ ఆడిట్ అండ్ కంప్లయన్స్, కంపెనీ సెక్రటేరియట్, అకౌంట్స్, స్ట్రాటజిక్ డెవలప్‌మెంట్ అండ్ పార్ట్‌నర్‌షిప్స్, ఎకనామిస్ట్. **అర్హత:** సంబంధిత విభాగంలో డిప్లొమా/ డిగ్రీ/ పీజీ, ఐసీడబ్ల్యూఏ/ సీఏఫ్ఏ/ సీఎంఏ/ సీఏతో పాటు పని అనుభవం.
వయసు: 01-10-2023 నాటికి 21 నుంచి 32 సంవత్సరాల మధ్య ఉండాలి.
ఎంపిక: ఆన్‌లైన్ పరీక్ష, వ్యక్తిగత ఇంటర్వ్యూ ఆధారంగా.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 13.11.2023.
పరీక్ష/ ఇంటర్వ్యూ నిర్వహణ: నవంబర్/ డిసెంబర్ 2023.
వెబ్‌సైట్: https://nabfid.org/

ఐఐటీ హైదరాబాద్‌లో స్పెషల్ రిక్రూట్‌మెంట్

సంగారెడ్డి జిల్లా కందిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ హైదరాబాద్ (ఐఐటీహెచ్) కింది ఫ్యాకల్టీ ఉద్యోగాల భర్తీకి సంబంధించి ఎస్సీ/ ఎస్టీ/ ఓబీసీ-ఎన్‌సీఎల్/ ఈడబ్ల్యూఎస్ కేటగిరీ అభ్యర్థులకు స్పెషల్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తోంది.
1. అసిస్టెంట్ ప్రొఫెసర్ 2. అసోసియేట్ ప్రొఫెసర్ 3. ప్రొఫెసర్
విభాగాలు: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్, బయోమెడికల్ ఇంజినీరింగ్, ఆంత్రప్రెన్యూర్‌షిప్ అండ్ మేనేజ్‌మెంట్, బయోటెక్నాలజీ, లిబరల్ ఆర్ట్స్, కెమికల్ ఇంజినీరింగ్, మెటీరియల్స్ సైన్స్ అండ్ మెటలర్జికల్ ఇంజినీరింగ్, కెమిస్ట్రీ, మ్యాథమెటిక్స్, సివిల్ ఇంజినీరింగ్, మెకానికల్ అండ్ ఏరోస్పేస్ ఇంజినీరింగ్, డిజైన్ అండ్ ఏరోస్పేస్ ఇంజినీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్, ఫిజిక్స్, డిజైన్. **వయసు:** అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు 35 ఏళ్లు. అసోసియేట్ ప్రొఫెసర్‌కు 45 ఏళ్లు. ప్రొఫెసర్‌కు 55 ఏళ్లు మించకూడదు.
ఎంపిక: విద్యార్హత, పని అనుభవం, రిసెర్చ్, పబ్లికేషన్ రికార్డులు, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా.
అర్హతలు: సంబంధిత విభాగంలో పీహెచ్‌డీతో పాటు బోధన/ పరిశోధన అనుభవం. **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** నవంబర్ 13
వెబ్‌సైట్: https://www.iith.ac.in/careers/

వాక్-ఇన్స్

ఎయిమ్స్ కల్యాణిలో జూనియర్ రెసిడెంట్‌లు

కల్యాణిలోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్), వివిధ విభాగాల్లో పదవీకాల ప్రాతిపదికన 74 జూనియర్ రెసిడెంట్ (నాన్-అకడమిక్) పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది.
అర్హత: ఎంబీబీఎస్ ఉత్తీర్ణులై ఉండాలి. **ఇంటర్వ్యూ తేదీ:** 17.11.2023.
వేదిక: అడ్మినిస్ట్రేటివ్ భవనం, గ్రౌండ్ ఫ్లోర్, ఎయిమ్స్, కల్యాణి.
వెబ్‌సైట్: https://aiimskalyani.edu.in/

ప్రవేశాలు

ఐఐటీ హైదరాబాద్‌లో పీహెచ్‌డీ

సంగారెడ్డి జిల్లా కందిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ హైదరాబాద్- జనవరి 2024 సెషన్‌కు సంబంధించి పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లో దరఖాస్తులు కోరుతోంది.
విభాగాలు: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, బయోమెడికల్ ఇంజినీరింగ్, బయోటెక్నాలజీ, కెమికల్ ఇంజినీరింగ్, కెమిస్ట్రీ, సివిల్ ఇంజినీరింగ్, క్లైమేట్ చేంజ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్, డిజైన్, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్, ఆంత్రప్రెన్యూర్‌షిప్ అండ్ మేనేజ్‌మెంట్ తదితరాలు. **అర్హత:** సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీ. **దరఖాస్తుకు చివరి తేదీ:** 02-11-2023.
వెబ్‌సైట్: https://iith.ac.in/news/2023/10/12/PhD-Admission-Portal-is-now-open/

కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖకు చెందిన సశస్త్ర సీమా బల్ (ఎస్ఎస్‌బీ) 2023 సంవత్సరానికి స్పోర్ట్స్ కోటాలో 272 కానిస్టేబుల్ (జనరల్ డ్యూటీ), గ్రూప్-సి, నాన్-గెజిటెడ్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. పదోతరగతి పాసై.. నిర్దేశించిన క్రీడల్లో పాల్గొన్న పురుష, మహిళా అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ పోస్టులను తాత్కాలిక ప్రాతిపదికన భర్తీ చేసినప్పటికీ పర్మనెంట్ చేసే అవకాశం ఉంది.

సశస్త్ర సీమా బల్‌లో కానిస్టేబుల్ అవుతారా?

అభ్యర్థుల వయసు 18-23 సంవత్సరాల మధ్య ఉండాలి. గరిష్ఠ వయసులో ఎస్సీ/ఎస్టీలకు పదేళ్లు, ఓబీసీలకు ఎనిమిదేళ్ల సడలింపు ఉంటుంది. దరఖాస్తు రుసుము రూ.100. ఎస్సీ, ఎస్టీ, మహిళా అభ్యర్థులకు ఫీజు మినహాయింపు ఉంటుంది.

ఏ క్రీడలు: ఆర్చరీ, అథ్లెటిక్స్, బాక్సింగ్, బాడీ బిల్డింగ్, బాస్కెట్‌బాల్, సైక్లింగ్, ఈక్వెస్ట్రియన్, ఫెన్సింగ్, జిమ్నాస్టిక్స్, హాకీ, జూడో, కబడ్డీ, కరాటే, పెన్‌కాక్ సిలాట్, పవర్‌లిఫ్టింగ్, షూటింగ్ స్పోర్ట్స్, స్విమ్మింగ్, తైక్వాండో, వాలీబాల్, రెజ్లింగ్, ఉషూ, వాటర్ స్పోర్ట్స్, వెయిట్ లిఫ్టింగ్.

ఎంపిక: క్రీడా విజయాలు, రాత పరీక్ష, ఫీల్డ్ ట్రయల్, స్కిల్ టెస్ట్, ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్, మెడికల్ ఎగ్జామినేషన్, రివ్యూ మెడికల్ ఎగ్జామినేషన్, డాక్యుమెంట్ వెరిఫికేషన్ మొదలైన వాటి ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ఎంపికైన అభ్యర్థులు దేశంలో ఎక్కడైనా లేదా భారత భూభాగం వెలుపలా సేవలు అందించాలి.

అంతర్జాతీయ క్రీడాపోటీల్లో పాల్గొని దేశం తరపున ప్రాతినిధ్యం వహించినవారికి మొదటి ప్రాధాన్యమిస్తారు. బంగారు పతకం సాధించినవారికి 30 మార్కులు, వెండి పతకానికి 29, కాంస్య పతకానికి 28, పాల్గొన్నవారికి 26 మార్కులు కేటాయిస్తారు.

రెండో ప్రాధాన్యం జాతీయ క్రీడా పోటీల్లో పాల్గొన్నవారికి ఇస్తారు. రాష్ట్ర/ కేంద్రపాలిత ప్రాంతాల తరపున జాతీయ క్రీడల్లో జూనియర్ లేదా సీనియర్ స్థాయిలో పాల్గొని.. బంగారు పతకం సాధిస్తే 25 మార్కులు, వెండి పతకం సాధిస్తే 24, కాంస్య పతకానికి 23 మార్కులు కేటాయిస్తారు. ముందుగా అభ్యర్థుల విద్యార్హతలు, వయసు, కులం, క్రీడల్లో సాధించిన విజయాలకు సంబంధించిన ఒరిజినల్ డాక్యుమెంట్లను పరిశీలిస్తారు. దీంట్లో అర్హత సాధించినవారికి ఫీల్డ్ ట్రయల్/ స్కిల్ టెస్ట్ నిర్వహిస్తారు. దీనికి 50 మార్కులు ఉంటాయి. అన్ని కేటగిరీల అభ్యర్థులూ 60 శాతం మార్కులు సాధించాలి. దీంట్లో గెలుపొందిన అభ్యర్థులకు ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్ (పీఎస్‌టీ) నిర్వహిస్తారు.

పీఎస్‌టీ: జనరల్ పురుష అభ్యర్థులు 170 సెం.మీ. ఎత్తు, చాతీ 80 సెం.మీ. ఉండి గాలి పీల్చినప్పుడు 85 సెం.మీ. వరకూ వ్యాకోచించాలి. మహిళా అభ్యర్థుల ఎత్తు 157 సెం.మీ. ఉండాలి. ఎస్టీ పురుష అభ్యర్థుల ఎత్తు 162.5 సెం.మీ., చాతీ 76-81 సెం.మీ. ఉండాలి. ఎస్టీ మహిళల ఎత్తు 150 సెం.మీ. ఉండాలి. అభ్యర్థులు ఎత్తూ, వయసుకు సరిపడినట్టుగా ఎంత బరువు ఉండాలనేది నోటిఫికేషన్‌లో వివరంగా తెలియజేశారు. పీఎస్‌టీలో అర్హత సాధించినవారికి వైద్య పరీక్ష నిర్వహించి తుది ఎంపిక చేస్తారు.

గుర్తుంచుకోవాల్సినవి

- డాక్యుమెంటేషన్, ఫిజికల్ స్టాండర్డ్, మెడికల్ టెస్టులకు హాజరయ్యే అభ్యర్థులు తప్పనిసరిగా అడ్మిట్ కార్డ్‌ను తీసుకెళ్లాలి.
- ఈ పోస్టులకు దరఖాస్తు చేయడానికి దివ్యాంగులు అర్హులు కారు.
- దరఖాస్తు ప్రింటవుట్‌ను అభ్యర్థులు భద్రపరుచుకోవాలి.
- గవర్నమెంట్/ సెమీ గవర్నమెంట్, పబ్లిక్ సెక్టర్ అండర్ టేకింగ్స్‌లో పనిచేసే అభ్యర్థులు 'నో అబ్జెక్షన్ సర్టిఫికెట్'ను సమర్పించాలి.

దరఖాస్తుకు చివరి తేదీ: ఎంప్లాయిమెంట్ న్యూస్‌లో ప్రకటన వెలువడిన తేదీ నుంచి 30 రోజుల్లోపు. 21.10.2023 నుంచి దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైంది.
వెబ్‌సైట్: www.ssbrectt.gov.in

తాజా ఇంటర్న్‌షిప్‌లు

విజయవాడ, వైజాగ్, హైదరాబాద్‌లో.. ఈవెంట్స్ కోఆర్డినేషన్

సంస్థ: ఇండియా యూత్ ఫర్ సొసైటీ **స్టైపెండ్:** నెలకు రూ.3,000-6,000 **దరఖాస్తు గడువు:** నవంబరు 2 **అర్హతలు:** ఈవెంట్ మేనేజ్‌మెంట్ నైపుణ్యం
☛ internshala.com/i/bc1fad

హైదరాబాద్‌లో.. డిజిటల్ మార్కెటింగ్

సంస్థ: మెగామైండ్స్ ఐటీ సర్వీసెస్ **స్టైపెండ్:** నెలకు రూ.8,000 **దరఖాస్తు గడువు:** నవంబరు 2 **అర్హతలు:** డిజిటల్ ఎడ్వర్టైజింగ్, డిజిటల్ మార్కెటింగ్ నైపుణ్యాలు
☛ internshala.com/i/536b9a

విజయవాడలో.. ఆపరేషన్స్

సంస్థ: ఐకుశల్ స్పేసెస్ **స్టైపెండ్:** నెలకు రూ.5,000 **దరఖాస్తు గడువు:** నవంబరు 3 **అర్హతలు:** ఆపరేషన్స్ నైపుణ్యం, ఆసక్తి ఉన్న విద్యార్థులు
☛ internshala.com/i/e440fd

వర్క్ ఫ్రమ్ హోమ్ డెవోప్స్ ఇంజినీరింగ్

సంస్థ: బ్లాక్‌ఫర్ **స్టైపెండ్:** నెలకు రూ.10,000 **దరఖాస్తు గడువు:** నవంబరు 9 **అర్హతలు:** సీఐ/సీడీ, డెవోప్స్, డాకర్, ఈఆర్‌పీ ఇంప్లిమెంటేషన్ అండ్ డెవలప్‌మెంట్ నైపుణ్యాలు
☛ internshala.com/i/32505f

ప్రొడక్ట్ మార్కెటింగ్

సంస్థ: కొరిజో ఎడ్యు-టెక్ **స్టైపెండ్:** నెలకు రూ.1,000-10,000 **దరఖాస్తు గడువు:** నవంబరు 9 **అర్హతలు:** ఎంఎస్-ఎక్సెల్, సోషల్ మీడియా మార్కెటింగ్ నైపుణ్యాలు
☛ internshala.com/i/cea063

హ్యూమన్ రిసోర్సెస్

సంస్థ: అగ్నిహోత్రి సెక్యూరిటీస్ **స్టైపెండ్:** నెలకు రూ.5,000 **దరఖాస్తు గడువు:** నవంబరు 9 **అర్హతలు:** హ్యూమన్ రిసోర్సెస్ నైపుణ్యం, ఆసక్తి ఉన్న విద్యార్థులు
☛ internshala.com/i/9f5ec1